సాక్షి బాపట్ల


I

శుక్రవారం । 22 । మార్చి । 2024



హుండీ లెక్కింపు

పెనమలూరు: యనమలకుదురులో వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో హుండీ లెక్కించారు. గురువారం లెక్కించగా రూ. 2,90,730 ఆదాయం వచ్చింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 513.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.



కొండపై కూల్ కూల్‌గా..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వేసవిలో భక్తులకు ఇబ్బంది కలగకుండా దుర్గగుడి దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. ఆలయ ప్రాంగణంలో కూల్ పెయింట్, కాయర్ మ్యాట్లు వేశారు.



న్యూస్‌రీల్

ముందస్తు ప్రవేశాలు చేపట్టకండి

ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి నీలావతిదేవి



నరసరావుపేటఈస్ట్: ఇంటర్మీడియెట్ 2024–25 విద్యాసంవత్సరానికిగాను ఇంటర్మీడియెట్ కళాశాలల యాజమాన్యాలు ఎటువంటి ముందస్తు ప్రవేశాలను చేపట్టరాదని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి ఎం.నీలావతిదేవి గురువారం తెలిపారు. ఈమేరకు ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ ఆదేశాలు జారీచేసినట్టు స్పష్టం చేశారు. ముందస్తు ప్రవేశాలు చేపట్టిన కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పదో తరగతి పరీక్షలు పూర్తి కాకుండానే మొదటి సంవత్సరం ప్రవేశాలకు కొన్ని కళాశాలలు ప్రయత్నాలు ప్రారంభించటం బోర్డు దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇంటర్మీడియెట్ విద్యామండలి త్వరలోనే 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశ షెడ్యూల్‌ను ప్రకటిస్తారని తెలిపారు. బోర్డు ప్రకటించే షెడ్యూల్ ప్రకారమే కళాశాలలు అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. బోర్డు ఆదేశాలను ఖాతరు చేయకుండా షెడ్యూల్ ప్రకటన కంటే ముందుగానే ప్రవేశాలు చేపట్టినట్టు ఫిర్యాదులు వస్తే ఆయా కళాశాలల గుర్తింపు రద్దుకు సిఫారసు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఏఆర్ అదనపు ఎస్పీ రామచంద్రరాజుకు ఉత్తమ సేవా పతకం



నరసరావుపేట: ప్రతి ఏడాది ఉగాది పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉత్తమ సేవా పతకానికి పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ(ఏఆర్) డి.రామచంద్రరాజు ఎంపికయ్యారు. గురువారం ఆయనను జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి అభినందించారు. దీర్ఘకాలం పోలీస్‌శాఖలో సేవలు అందించే పోలీసులకు ఈ పతకాన్ని ప్రకటిస్తారు. గతంలో అదనపు ఎస్పీకి 2017 సేవా పతకం, 2019లో ఉత్కృష్ట సేవా పతకం అందుకున్నారు. జిల్లా పోలీస్ విభాగంలో సౌమ్యునిగా పేరుగాంచిన రామచంద్రరాజుకి ఉత్తమ సేవా పతకం రావడంతో పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

కౌంటింగ్ కేంద్రాలు పరిశీలించిన కలెక్టర్



నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి గురువారం పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు సూచించారు. జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్, జిల్లా రెవిన్యూ అధికారి వినాయకం, ఆర్డీవో సరోజ, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సిహెచ్ శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

'ఆసరా'పై వైద్యులు, సిబ్బందికి శిక్షణ తరగతులు

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో పని చేస్తున్న వైద్యాధికారులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లకు గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఆసరా అమలుపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవం అయిన ప్రతి ఒక్కరికీ ఆరోగ్య ఆసరా కింద రూ. 5వేలు పారితోషికం అందజేయాలని ఆదేశించారు. డెలివరీ అయిన వారి డాక్యుమెంట్లు, ఆధార్, బ్యాంక్ అకౌంట్ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి లక్ష్మీకుమారి, అకౌంట్స్ ఆఫీసర్ కృష్ణకుమారి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ విజయప్రకాష్ పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై డేగకన్ను

- ఎన్నికల కమిషన్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు
- జిల్లాలో 18 పోలీసు ఫ్లైయింగ్ స్క్వాడ్ టీములు
- ఫిర్యాదులకోసం సీ–విజిల్ యాప్
- జిల్లా సరిహద్దుల్లో తొమ్మిది చెక్‌పోస్టులు
- ఎన్నికల కోడ్ అమలుకు 29 టీములు
- పాత నేరస్తులు 419 మంది, 7,312 మంది అల్లరి మూకలపైనా బైండోవర్లు
- ఇప్పటికే రూ. 2.45 కోట్ల నగదు, రూ. 50 లక్షల మద్యం, 25 లక్షల విలువచేసే గంజాయి స్వాధీనం
- జిల్లాకు రెండు బెటాలియన్ల బీఎస్ఎఫ్ బలగాలు
- సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు కవాతులు
- సాక్షితో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి ప్రతినిధి, బాపట్ల: కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఎన్నికల నిబంధనలను అతిక్రమించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. పర్యవేక్షణ కోసం ప్రత్యేక బృందాల్ని ఏర్పాటు చేసింది. చెక్ పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీల్ని ముమ్మరం చేసింది. సమస్యాత్మక గ్రామాలపై దృష్టి పెట్టింది. అల్లరి మూకలు, రౌడీషీటర్లను బైండోవర్లు చేసింది. బ్యాంకులు మినహా మిగిలిన వారి వద్దనుంచి తుపాకులు, ఇతర ఆయుధాల్ని స్వాధీనం చేసుకుంది. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు గుర్తించి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా సజావుగా పోలింగ్ నిర్వహించేందుకు పోలీసు ఉన్నతాధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయలతో పాటు మద్యం, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీటి అక్రమ రవాణాపై నిత్యం నిఘాపెట్టారు. జిల్లాలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యల్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం 'సాక్షి'కి వివరించారు.

సాక్షి: ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్పీ: జిల్లాలో 18 ఫ్లయింగ్ స్క్వాడ్ టీములతో పాటు ఎంపీడీవోల పరిధిలో మరో 29 టీముల్ని ఏర్పాటు చేశాం. ఇప్పటికే తొమ్మిది చెక్ పోస్టులను ఏర్పాటు చేశాం. మరో మూడు చోట్ల రెండు, మూడు రోజుల్లో ఏర్పాటు చేస్తాం. నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఎన్నికల కోడ్‌ను అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నాం.

సాక్షి: పోలీసు బందోబస్తు , భద్రత ఏర్పాట్లు గురించి వివరించండి

ఎస్పీ: జిల్లాకు ఇప్పటికే రెండు బెటాలియన్ల (160 మంది) బీఎస్ఎఫ్ బలగాలు వచ్చాయి. ఒక బెటాలియన్‌ను చీరాలలో, మరో బెటాలియన్‌ను సూర్యలంకలో ఉంచాం. అదనంగా 15,00 మందికి పైగా స్థానిక పోలీసు బలగాలున్నాయి. ఎన్నికల సమయంలో అవసరమైన మేరకు బలగాలు రానున్నాయి. పోలీసులతో జిల్లాలోని క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు, సమస్యాత్మక గ్రామాల్లో నిత్యం ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నాం.

సాక్షి: ఫిర్యాదుల కోసం ఎలాంటి చర్యలు తీసుకున్నారు ?

ఎస్పీ: పబ్లిక్ ప్లేసులు, ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల పరిధిలో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు ఉండకూడదు. అటువంటివి ఉంటే ఫిర్యాదులు చేయవచ్చు. ఇందుకోసం ప్రత్యేకంగా సీ–విజిల్ యాప్‌ను ఏర్పాటు చేశాం. ఫిర్యాదు అందిన వెంటనే కేసులు నమోదు చేస్తాం. ఇందుకోసం నియోజకవర్గానికి మూడు చొప్పున ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలు నియమించాం. అవి నిత్యం పని చేస్తాయి.

సాక్షి: అక్రమాలు అరికట్టేందుకు పోలీసు శాఖ సన్నద్ధత గురించి తెలియజేయండి ?

ఎస్పీ: జిల్లా సరిహద్దులోని బొల్లాపల్లి, పెనుమూడి, సంతమాగులూరు, చినగంజాం తదితర ప్రాంతాల్లో ఇప్పటివరకూ తొమ్మిది చెక్ పోస్టులు పెట్టాం. మరో మూడు చోట్ల ఏర్పాటు చేయబోతున్నాం. నిత్యం మూడు షిఫ్టుల్లో వెహికల్ చెకింగ్ ఉంటుంది. ఇప్పటివరకూ తనిఖీల ద్వారా రూ. 2.45 కోట్ల నగదు,రూ 50 లక్షల విలువచేసే 12,799 లీటర్ల మద్యం, రూ. 25 లక్షల విలువచేసే 478 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. 1,372 కేసులు పెట్టాం.

సాక్షి: శాంతిభద్రతల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్పీ: జిల్లాలో 137 లైసెన్స్‌డ్ తుపాకులు ఉండగా ఇందులో 68 బ్యాంకు సిబ్బందివి పోను మిగిలిన వాటిని స్వాధీనం చేసుకున్నాం. నాన్‌బెయిలబుల్ కేసులు 260 ఉండగా ఇప్పటివరకు 254 కేసులు క్లియర్ చేశాం. సీఆర్‌పీసీ 107 పరిధిలో ఉన్న 7,312 మందిని, 101 సీఆర్‌పీసీ పరిధిలో ఉన్న 419 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేశాం. వారందరికీ కౌన్సిలింగ్ ఇచ్చాం.

సాక్షి: పోలింగ్ ప్రశాంతంగా జరిపేందుకు తీసుకుంటున్న చర్యలేమిటి?

ఎస్పీ: ప్రధానంగా జిల్లాలో 332 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను ఇప్పటికే గుర్తించాం. వాటి పరిధిలో అదనపు పోలీసు బలగాలు ఉంటాయి. వెబ్ కెమెరాలు ఉంటాయి. ముందస్తుగా ఆ పోలింగ్ స్టేషన్ల పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారికి కౌన్సెలింగ్ ఉంటుంది. అవసరమైతే కేసులు పెడతాం. భద్రత పరంగా అన్ని చర్యలు తీసుకుంటాం.

గీత దాటితే వేటు తప్పదు

బాపట్ల టౌన్: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. తన క్యాంప్ కార్యాలయంలో గురువారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. పార్టీ, అభ్యర్థి స్థానిక పోలీస్ అధికారులకు ముందుగానే సభ నిర్వహించే ప్రదేశం, సమయాన్ని తెలియజేయాలని కోరారు. సభ ఏర్పాటు విషయంలో నిషేధాత్మక, నిర్బంధాత్మక ఆదేశాలు ఉన్నాయా... లేదా ? అనేది సరి చూసుకోవాలని సూచించారు. సభల్లో లౌడ్ స్పీకర్లు వినియోగించేందుకు ముందుగానే సంబంధిత అధికారికి లిఖితపూర్వకంగా దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు, నిర్బంధాలను పాటించాలని చెప్పారు. అభ్యర్థులు, వేర్వేరు రాజకీయ పార్టీలు ఒకే మార్గంలో ఊరేగింపు తలపెట్టినప్పుడు అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులుతో సంప్రదింపులు జరపాలని సూచించారు. రాజకీయ పార్టీల సభ్యులు, నాయకుల దిష్టిబొమ్మలను మోసుకెళ్లటం, దహనం చేయటం వ్యతిరేక ప్రదర్శన రూపాలను నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కులాలు, జాతులు మధ్య మత, భాషా, స్థానిక పరమైన ఉద్రేకాలను కలిగించే ఏ విధమైన కార్యకలాపాలను ఏ పార్టీ అభ్యర్థులు నిర్వహించరాదని సూచించారు. ఓటర్లకు లంచం ఇవ్వడం, బెదిరించడం, ప్రలోభాలకు గురిచేస్తే సహించేది లేదని తెలిపారు. ఎన్నికల ప్రచారం కోసం మసీదులు, చర్చిలు, దేవాలయాలు మరే ఇతర ఆరాధన ప్రదేశాలు, పాఠశాలల్ని వేదిక ఉపయోగించకూడదని స్పష్టం చేశారు. ప్రచారంలో ఉపయోగించే వాహనాలన్నిటికీ సంబంధిత అధికారి ధ్రువీకరణ పత్రంతో ఉపయోగించాలని వివరించారు. రోడ్ షోలు నిర్వహించే వ్యక్తులు కచ్చితంగా ఎన్నికల నియమావళి నిబంధనకు లోబడి మాత్రమే నడుచుకోవాలన్నారు. ఓటర్లకు నగదు, మద్యం పంపిణీ చేస్తే కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటలలోపు కచ్చితమైన పర్మిషన్ లేకుండా పబ్లిక్ ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు ఉపయోగించరాదని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రజలంతా నిష్పక్షపాతంగా, నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రజలకు కావాల్సిన సహకారం, రక్షణ ఏర్పాట్లను పోలీస్ శాఖ తరఫున శక్తివంచన లేకుండా అందజేస్తామని వివరించారు.

విద్యార్థిపై కర్రతో విచక్షణారహితంగా దాడి

పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకుడు సస్పెన్షన్



గాయపడిన నవదీప్‌కుమార్

బాపట్ల: స్థానిక ఇంజినీరింగ్ కాలేజీలో సెకండ్ షిఫ్టులో పాలిటెక్నిక్ చదువుతున్న విద్యార్థి బొనిగల నవదీప్‌కుమార్‌ని అధ్యాపకుడు కొత్తమాసు బాలాజీ విచక్షణ రహితంగా కొట్టాడు. కర్రతో కొట్టడంతో గాయపడిన నవదీప్‌కుమార్‌ను గురువారం ఏరియా వైద్యశాల్లో చేర్పించారు. రెండు గంటలు పాటు కళాశాలలోనే నిర్బంధించి నవదీప్‌కుమార్‌పై దాడి చేయడంపై కేసు నమోదు చేయాలని పలు దళిత సంఘాలు పిలుపునిచ్చాయి. విద్యార్థిపై అనుచితంగా ప్రవర్తించిన మెకానికల్ విభాగ అధ్యాపకుడు బాలాజీని సస్పెండ్ చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ నజీర్ పేర్కొన్నారు. ఘటనపై సత్వర విచారణకు కమిటీని నియమించినట్లు తెలిపారు.

గేట్‌లో హోం సైన్స్ కాలేజీ విద్యార్థులకు ర్యాంకులు

బాపట్ల: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల (హోం సైన్స్) విద్యార్థులు గేట్‌లో ర్యాంకులు సాధించారని డీన్ డాక్టరు ఎల్.ఏడుకొండలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జి. సుమంత్ (3698), టి. శ్రీనివాస్(3838), హెచ్. కశ్యప్ దొర(6582), పి.భాను ప్రత్యూష (7361), బి. లహరి(9744) ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. వీరంతా ఐఐటీ, ఎన్ఐటీ, నిఫ్టెమ్(తంజావూరు)లాంటి కళాశాల్లో అభ్యసించేందుకు అవకాశం ఉందని వెల్లడించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఆయనతో పాటు సిబ్బంది అభినందనలు తెలిపారు.

సంబరంగా సాగు.. రైతు బాగు

- నాడు వ్యవసాయం దండగన్న చంద్రబాబు
- నేడు పండుగ చేసిన సీఎం జగన్
- అడుగడుగునా రైతులకు అండగా పాలన
- గ్రామాల్లోనే రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు
- విత్తనాలు మొదలు ధాన్యం విక్రయం వరకు తోడుగా జగనన్న సర్కార్
- అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు



రబీలో వేరుశెనగ విత్తనాలు నాటుతున్న రైతులు

బాపట్ల టౌన్: ఆపదలో ఉన్న రైతుల్ని ఆదుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారు. అన్ని విధాలా అండగా ఉంటున్నారు. టీడీపీ ప్రభుత్వం హయంలో రైతులకు వ్యవసాయం భారంగా మారింది. నీటి సమస్యతో పాటు చేతిలో పెట్టుబడులు లేక సాగు అంటేనే భయపడే విధంగా తయారైంది. కనీసం రైతుల కష్టాలు తీర్చక పోగా.. వ్యవసాయమే దండగ అనే పరిస్థితికి తీసుకొచ్చిన ఘనుడు చంద్రబాబు. గతంలో నిర్వహించిన ప్రజా సంకల్పయాత్రలో భాగంగా రైతులు పడుతున్న కష్టాలను స్వయంగా సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చూశారు. అధికారంలోకి రాగానే రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించడంతోపాటు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించారు. పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయడం చేశారు.

వైఎస్సార్ రైతు భరోసాతో రైతుకు ధీమా

వ్యవసాయం లాభసాటిగా ఉండాలన్నా ఆలోచనతో రైతుకి పెట్టుబడి నిధిగా వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకాన్ని ప్రకటించారు. దీని ద్వారా ఏడాదికి ఒక్కో రైతుకు రూ. 13,500 చొప్పున ఐదేళ్లలో రూ. 67,500 అందించారు. ఈ విధంగా ప్రకటించిన నగదును రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే మాసానికి ముందుగా మేలో రూ. 7,500 అందించారు. ఖరీఫ్ కోతలు, రబీలో సాగుచేసే రైతులకు అవరాల కొనుగోలు నిమిత్తం ఉపయోగపడే విధంగా అక్టోబర్‌లో రూ. 4 వేలు, సంక్రాంతి పండుగను రైతులు కుటుంబసమేతంగా జరుపుకునేందుకు వీలుగా జనవరిలో రూ. 2 వేల చొప్పున ఏడాదికి రూ. 13,500 చొప్పున అందజేశారు.

రైతుభరోసా కేంద్రాలతో అండాదండా

రైతులు నివాసం ఉండే గ్రామాల్లో ప్రతిచోట రూ. 21.80 లక్షలతో రైతుభరోసా కేంద్రాన్ని నిర్మించారు. ఇప్పటికే జిల్లాలో రూ. 32.26 కోట్లతో 148 కేంద్రాల్ని ప్రారంభించారు. ఇందులో రైతు సహాయకులను నియమించారు. వారి ద్వారా రైతులు సాగుచేసిన పంటలను ఈ క్రాప్‌బుకింగ్ చేయడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వెంటనే ఆదుకోవడం, ఇన్‌పుట్ సబ్సిడీ, యాంత్రీకరణ పరికరాలు పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది జగనన్న ప్రభుత్వం.

చేతల నాయకుడు సీఎం జగన్



గతంలో చాలామంది ముఖ్యమంత్రులను చూశాం. అధికారంలోకి రాకముందు వాగ్దానాలు చేయడం, తర్వాత వాటి గురించి పట్టించుకోవడమే మానేసేవారిని చూశాం. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఏదైనా మాట ఇస్తే ఎన్ని ఇబ్బందులు ఎదురైనా నిలబెట్టుకోవడమే లక్ష్యంగా ముందుకెళ్లిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి. ఆయన తీసుకువచ్చిన ఎన్నో పథకాల వల్ల రైతులకు ఎంతో లబ్ధి చేకూరింది.

– అంగిరేకుల వెంకటేశ్వర్లు, ముత్తాయపాలెం

గడిచిన ఐదేళ్లలో రూ. 3844.26 కోట్లు పంపిణీ

- జిల్లాలో రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్, రైతుభరోసా, ఇన్‌పుట్ సబ్సిడీలాంటి పథకాలతో ఏకంగా గడిచిన ఐదేళ్లలో రూ. 3844.26 కోట్లును అందజేశారు.
- ఇందులో యంత్రసేవా పథకం ద్వారా 402 సీహెచ్‌సీఎస్ గ్రూపులకు గానూ 266 యంత్రాలను రూ. 12.38 కోట్లతో పంపిణీ చేశారు.
- సున్నావడ్డీ పథకం రూపంలో 1,26,869 మంది రైతులకు గానూ రూ. 24.90 కోట్లు పంపిణీ చేశారు.
- ఇన్‌పుట్ సబ్సిడీ కింద 1,14,619 రైతులకు గానూ 75,319 హెక్టార్లలో పంట నష్టానికి రూ.117.56 కోట్లు పంపిణీ చేశారు.
- రైతు భరోసా సాయం కింద 1,92,037 మంది రైతులకు రూ.3515.24 అందజేశారు.
- క్రాఫ్ ఇన్సూరెన్స్ కింద 92,119 మంది రైతులకు రూ.174.18 కోట్లు జమ చేశారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు

ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్‌బాషా హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

బాపట్ల: రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ప్రభుత్వ ఉద్యోగుల ప్రమేయం ఉండరాదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా హెచ్చరించారు.స్థానిక స్పందన సమావేశ మందిరంలో అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో గురువారం ఆయన ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ప్రభుత్వ ఉద్యోగులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఏ రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాలలోనైనా పాల్గొన్నట్లు ఫిర్యాదులు వస్తే తక్షణమే వారిని సస్పెండ్ చేయాలని అధికారుల్ని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసే వరకు ప్రభుత్వ ఉద్యోగులను బదిలీలు, డెప్యూటేషన్‌పై పంపడం వంటివి ఎట్టి పరిస్థితుల్లో చేయరాదని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణ నిమిత్తం ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను ఎన్ఐసీ పోర్టల్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు 12,927 మందివి మాత్రమే పొందుపరిచామని, మిగిలిపోయిన వారి వివరాలను తక్షణమే చేయాలని చెప్పారు. ఒప్పందం, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను సైతం ఇందులో నమోదు చేయాలని తెలిపారు. ఉద్యోగుల వివరాలు కచ్చితంగా ఉండాలని ఆయన సూచించారు.

మినహాయింపు కోరుతూ 875 దరఖాస్తులు

ఎన్నికల విధుల నుంచి ఉద్యోగులకు ఎలాంటి మినహాయింపు లేదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్ బాషా స్పష్టం చేశారు. అత్యవసర సేవలు అందించే వైద్య ఆరోగ్యశాఖ, పశుసంవర్ధక, అగ్నిమాపక శాఖలకు మాత్రమే ఉన్నాయన్నారు. మినహాయింపులు కోరుతూ 875 దరఖాస్తులు వచ్చాయని, వాటి పరిశీలనకు జిల్లా రెవెన్యూ అధికారి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డీఈవో, డీఎల్‌డీవోలను నియమిస్తున్నట్లు ప్రకటించారు. వారు ధ్రువీకరించిన వారికి మాత్రమే మినహాయింపులు ఉంటాయని, లేనిపక్షంలో ఎన్నికల విధులు కచ్చితంగా నిర్వర్తించాల్సి ఉంటుందని తెలపారు. ఎన్నికల పోలింగ్‌లో సమస్యలు ఉత్పన్నం కాకుండా యంత్రాంగం సహకరించాలని ఆయన కోరారు.

విభిన్న ప్రతిభావంతులకు పోలింగ్ కేంద్రం కేటాయించాలి: జేసీ

ప్రతి శాసనసభ నియోజకవర్గానికి ఒక పోలింగ్ కేంద్రంలో పూర్తిగా విభిన్న ప్రతిభావంతులనే నియమించాలని ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ఉన్నాయని జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్. శ్రీధర్ తెలిపారు. విభిన్న ప్రతిభావంతులైన ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికల విధులు కేటాయిస్తామన్నారు. బాపట్ల జిల్లాలోని 25 మండలాలలో పనిచేస్తున్న ఉద్యోగులందరి వివరాలను ఎన్ఐసీ పోర్టల్‌లో నమోదు చేసిన అనంతరం అధికారులు ధ్రువీకరణ పత్రం సమర్పించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ ఫ్రం హోం

- వృద్ధులు, దివ్యాంగులకు ఊరట
- తొలిసారిగా సార్వత్రిక ఎన్నికల్లో అమలు
- పల్నాడు జిల్లాలో 85+ వయోవృద్ధులు 9,937 మంది, దివ్యాంగులు 20,123 మంది గుర్తింపు
- నియోజకవర్గ కేంద్రాల్లోనే ఫెసిలిటేషన్ సెంటర్లు

సత్తెనపల్లి: పోలింగ్ కేంద్రాలకు రాలేని దుస్థితిలో ఉన్న దివ్యాంగులు, వయోవృద్ధులకు ఇంటి నుంచే ఓటు వేసే(హోం ఓటింగ్) విధానాన్ని ఎన్నికల యంత్రాంగం అమలు చేస్తోంది. దివ్యాంగులు, వృద్ధులు ఎన్నికల కేంద్రాలకు వచ్చి ఓటు వేసేందుకు గతంలో నానా ఇబ్బందులు పడేవారు. తాజా నిర్ణయంతో వీరికి ఈ కష్టాలు తొలగనున్నాయి. ఇంటి వద్ద వేసేందుకు మొబైల్ ఓటింగ్ వాహనాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో 85 ఏళ్లకు పైబడిన వయోవృద్ధులు, 60 శాతానికి పైబడి శారీరక వైకల్యం ఉన్నవారు ఇంటి వద్ద ఓటేసే అవకాశం కల్పిస్తూ ఎన్నికల సంఘం నిర్ణయించింది. ముందుగా వారు తాము పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లలేమంటూ ఎన్నికల రిటర్నింగ్ అధికారి లేదా సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అధికారి వీటిని స్వయంగా పరిశీలించి ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. జిల్లాలో దివ్యాంగులు మొత్తం 20123 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 11,973, మహిళలు 8,148, ఇతరులు ఇద్దరు ఉన్నారు. 85 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులు మొత్తం 9937 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 3,804, మహిళలు 6,132, ఇతరులు ఒకరు ఉన్నారు.

ఫారం–12డీ అందజేయనున్న బీఎల్ఓలు

శారీరక దివ్యాంగులు, వయోవృద్ధులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే వారిని ముందుగా పోలింగ్ బూత్ స్థాయి అధికారులు గుర్తించి వారి ఇంటికి వెళ్లి ఫారం 12డీ అందజేస్తారు. వారు దాన్ని పూరించి తిరిగి బీఎల్ఓలకు అందజేస్తారు. ఈ దరఖాస్తులను బీఎల్ఓలు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందజేస్తారు. దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి నిర్ధారణ చేసిన తర్వాతే ఇంటికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి పోస్టల్ బ్యాలెట్ పంపుతారు. ఇందులో ఎవరైనా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటేస్తామని చెబితే వారికి 12డీ దరఖాస్తులు ఇవ్వరు. వారు నేరుగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయాల్సి ఉంటుంది. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులకు ర్యాంపులు, వయోవృద్ధులకు చక్రాల కుర్చీలు అందుబాటులో ఉంటాయి.

రహస్య పద్ధతిలో ఓటింగ్

ఎవరైతే ఫారం–12డీ పూరించి ఇంటి వద్దే ఓటు వేయాలని దరఖాస్తు చేసుకుంటారో అలాంటి వారి ఇంటికి ఎన్నికల సిబ్బంది మొబైల్ వాహనంలో చేరుకుంటారు. ఇందులో ఇద్దరు పోలింగ్ అధికారులు, ఒక వీడియోగ్రాఫర్, మరో రక్షణ అధికారి ఉంటారు.



అక్కడ ఓటరుకు పోస్టల్ బ్యాలెట్ అందజేస్తారు. అధికారులు నిర్దేశించిన పోలింగ్ కంపార్ట్‌మెంట్‌లో ఓటరు రహస్యంగా ఓటు వేసి బ్యాలెట్ బాక్స్‌లో వేస్తారు. ఈ ప్రక్రియను అధికారులు పూర్తిగా చిత్రీకరిస్తారు. ఈ ప్రక్రియ సాధారణ ఎన్నికలకు ఒకరోజు ముందుగానే పూర్తి చేస్తారు. ఆ ఓటును సీల్ చేసిన అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ద్వారా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి తరలిస్తారు.

ఫెసిలిటేషన్ సెంటర్లతో ఉద్యోగులకు సమయం ఆదా

ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, అదర్ పోలింగ్ పర్సనల్స్ సుమారు 20 వేల మంది ఉండవచ్చని తెలుస్తోంది. ఇది ఇంకా ఆర్వోల నుంచి రావాల్సింది. గతంలో నిర్వహించిన తేదీన అందరూ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లకు వచ్చి పోస్టల్ బ్యాలెట్లు తీసుకొని తమ ఓటు వినియోగించుకునేవారు. ఇందువల్ల సమయం, డబ్బు వృథా అవుతుంది. జిల్లాలో ఈ ఏడాది కొత్తగా ఆయా అసెంబ్లీ నియోజకవర్గం కేంద్రాల్లోనే పోలింగ్ సిబ్బందికి ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీరు కాకుండా ఆర్టీసీ ఉద్యోగులు, ఇతర అత్యవసర విధులు నిర్వర్తించే శాఖలకు చెందిన ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అందజేస్తారు. అలాగే జైళ్లలో ఉండే రిమాండ్ ఖైదీలకు పోస్టల్ బ్యాలెట్లు అందజేస్తారు.

తిరునాళ్ల నిర్వహణపై ఈసీ స్పందించాలి

పల్నాడు మేధావుల వేదిక కన్వీనర్ సాంబశివరావు

నరసరావుపేట ఈస్ట్: ఎన్నికల కోడ్ పేరుతో పోలీస్ శాఖ తిరునాళ్లపై విధిస్తున్న ఆంక్షలతో ప్రజల మనోభావాలు దెబ్బతినటంతో పాటు వేలాది మంది ఉపాధిని కోల్పోతున్నారని పల్నాడు మేధావుల వేదిక కన్వీనర్ కోడూరి సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలు, పార్టీల ప్రమేయం లేకుండా తిరునాళ్లను సజావుగా నిర్వహించుకునేలా ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను రూపొందించి, అమలు చేసేలా పోలీస్ శాఖను ఆదేశించాలని కోరారు. ఈమేరకు రాష్ట్ర ముఖ్య ఎన్నికల కమిషన్ అధికారికి గురువారం ఈ-మెయిల్ ద్వారా వినతి పత్రం సమర్పించినట్టు తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో మార్చి నుంచి జూన్ వరకు 100కు పైగా గ్రామాల్లోని చారిత్రక ఆలయాలతో పాటు గ్రామ దేవతల ఆలయాల్లో వార్షిక తిరునాళ్ల జరపటం ఆనవాయితీగా వస్తున్నదని తెలిపారు. సంస్కృతీ, సంప్రదాయాలతో పాటు తిరునాళ్ల సందర్భంగా పలు రకాల వృత్తిదారులు, కళాకారులు, వ్యాపారులు కుటుంబాలకు ఈ నెలలు ఆదాయం ఏడాది పాటు జీవించేలా చేస్తుందని వివరించారు. ఎన్నికల కమిషన్ సత్వరం స్పందించి నిర్ణయం తీసుకోవాలని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు.

అచ్చంపేటలో బయటపడ్డ టీడీపీ 'వక్రభాష్యం'

- వైఎస్సార్ సీపీ ఎంపీటీసీకి బలవంతంగా కండువావేసి.. ఫొటోలకు ఫోజులు!
- ఎమ్మెల్యే శంకరరావును ఆశ్రయించి అసలు విషయం బయటపెట్టిన వైనం


అచ్చంపేట ఎంపీటీసీ షేక్ మొహిద్దీన్‌కు పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: నిన్నా మొన్నటి వరకు నియోజకవర్గం ఎటో కూడా తెలియని టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ఎలాగైనా వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజాప్రతినిధులను వశపరుచుకునే కుటిల యత్నాలు మొదలు పెట్టారు. ఇంట్లో ఉన్న వారిని సైతం ఇప్పుడే వెళుదువుగానంటూ తీసుకెళ్లి డబ్బు ఎరచూపి బలవంతంగా మెడలో పచ్చ కండువా కప్పి ఫొటోలు తీసి .. మా పార్టీలోకి వచ్చాడంటూ సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టి ఆనందపడి పోతున్నారు.

వివరాల్లోకి వెళితే.. అచ్చంపేట-1 ఎంపీటీసీ షేక్ మొహిద్దీన్‌ను ఇంటికి బుధవారం సాయంత్రం కొంతమంది టీడీపీ నాయకులు వచ్చారు. 'నీతో పనుంది.. వెంటనే వద్దువు రమ్మనమని' టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ వద్దకు తీసుకెళ్లారు. ఆయన తమ పార్టీలోకి రమ్మంటూ ప్రలోభ పెట్టారు. అయినా వినకపోయే సరికి బలవంతంగా టీడీపీ కండువా కప్పి, ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టారు. అది చూసుకుని అవాక్కైన సదరు ఎంపీటీసీ మొహిద్దీన్ గురువారం ఉదయాన్నే ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వద్దకు వెళ్లి తాను వైఎస్సార్ సీపీలోనే ఉన్నానన్నారు. ప్రాణం పోయినా వీడేది లేదని, టీడీపీ వారు తమ పార్టీలోకి రావాలంటూ బలవంతంగా పచ్చ కండవా వేసి ఫొటోలు తీశారంటూ ఎమ్మెల్యేకి మొరపెట్టుకున్నారు. తిరిగి ఎమ్మెల్యే తో వైఎస్సార్ సీపీ కండువా కప్పించుకున్నారు.

టీడీపీవి చీప్ పాలిటిక్స్

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ టీడీపీ నేతలు అధికారంలో ఉండగా నియోజకవర్గంలో ఏం చేశారో, ఇకపై ఏం చేస్తారో చెప్పుకునే ధైర్యంలేక ఇలాంటి చీప్ పాలిటిక్స్ ప్లే చేస్తూ ప్రజలలో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తల్లో అలజడులు సృష్టిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కానీ ప్రజలెవ్వరూ టీడీపీ మాటలు నమ్మే పరిస్థితులలో లేరని, గత 5 సంవత్సరాల కాలంలో నియోజకవర్గంలో ఎంత అభివృద్ధి జరిగింది... ఎవరెవరికి ఎన్ని సంక్షేమ ఫలాలు అందాయో అందరికీ తెలుసునన్నారు. మంచి చేసే వారిని వదులుకునేందుకు ఎవరూ సిద్ధంగా లేరని, మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వివరించారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగసాని బాబు, అచ్చంపేట సర్పంచ్ షేక్ జాని, మాజీ సర్పంచ్ కంబాల వీరబాబు, వ్యవసాయ యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, పెదకూరపాడు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, రవి, ఈపూరి శ్రీనివాసరెడ్డి, విప్పర్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

తప్పు తెలుసుకుని తిరిగొచ్చాం

అమరావతి: ప్రలోభాలకులోనై గురువారం ఉదయం టీడీపీలో చేరిన అమరావతి గాజుల పాలెం వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సాయంత్రానికి తప్పు తెలుసుకుని మళ్లీ సొంత గూటికి చేరారు. గురువారం సాయంత్రం క్రోసూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఓర్సు రవి, దేవాళ్ల పవన్, పల్లపు రాజు, బండారు కోటేశ్వరరావులకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఓర్సు రవి మాట్లాడుతూ తమ కాలనీకి చెందిన ఓ వ్యక్తి మభ్యపెట్టి మీటింగ్ ఉందని తీసుకువెళ్లి టీడీపీ కండువాలు కప్పించారన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలమైన తమను ఇష్టం లేకుండానే టీడీపీలో చేర్చారన్నారు. నిజం తెలుసుకొని ఇవాళ మళ్లీ పార్టీలోకి తిరిగి వచ్చామన్నారు. టీడీపీ నేతలు ఇలాగే మరికొంత మందిని ప్రలోభాలకు గురిచేయడానికి చూస్తున్నారని, ఎవరూ నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తన్నీరు శ్రీనివాసరావు, కోవూరి వెంకటేశ్వరరావు, నండూరు కరుణకుమార్ పాల్గొన్నారు.

సరిహద్దుల్లో పకడ్బందీగా నిఘా ఉంచండి

సమీక్షించిన జిల్లా కలెక్టర్, అదనపు జిల్లా ఎస్పీ


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శివశంకర్, అదనపు ఎస్పీ రాఘువేంద్ర

నరసరావుపేట: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టుల్లో నిఘా పకడ్బందీగా ఉంచాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాలులో చెక్ పోస్టులవద్ద నిఘాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు-3, సరిహద్దు చెక్‌పోస్టులు-6, ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్‌పోస్టులు-16 ఉన్నాయన్నారు. ఆయా చెక్‌పోస్టులలో అవసరమైన సిబ్బందిని త్వరితగతిన ఆయా శాఖలు నియమించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలో స్వాధీన పరచుకున్న సామగ్రి, ధనం, ఇతరములను స్ట్రాంగ్ రూముల్లో భద్రపర్చాలని అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, జిల్లా అదనపు ఎస్పీ రాఘవేంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పలువురిపై చర్యలు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పలు ప్రభుత్వ సిబ్బంది ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు వచ్చిన వార్తలపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ తక్షణమే స్పందించి చర్యలు తీసుకొన్నారు. పలువురు వలంటీరు, మద్యం దుకాణం సూపర్‌వైజర్లు విధుల నుంచి తొలగించారు. అదేవిధంగా సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'మాకు కనిపించవంతే' అనే వార్తకు స్పందించిన కలెక్టర్ ఎన్నికల నియమావళి ప్రకారం 60 అడుగుల విగ్రహాన్ని మూసి వేయడం జరిగిందని తెలిపారు.

ఏడు కిలోమీటర్లు... ఐదే నిమిషాల ప్రయాణం !

- కొండమోడు జంక్షన్ నుంచి ఖలీల్ దాబా వరకు..
- స్వయంగా ప్రయాణించి చూపిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- ప్రతిపక్ష నేత విమర్శలపై ఎద్దేవా

పిడుగురాళ్ల: కేవలం ఐదు నిమిషాల్లో ఏడు కిలోమీటర్ల మేర నిర్మాణమైన పిడుగురాళ్ల బైపాస్ రోడ్డు దాటినట్లు గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వెల్లడించారు. గురువారం సాయంత్రం తన వాహనంతో కొండమోడు జంక్షన్ నుంచి పిడుగురాళ్ల బైపాస్, రైల్వే బ్రిడ్జి మీదుగా ఖలీల్ దాబా వరకు బైపాస్ రోడ్డును కేవలం ఐదు నిమిషాల 48 సెకన్లలో ప్రశాంతంగా ప్రయాణించానని వెల్లడించారు. బైపాస్ రోడ్డు, రైల్వే బ్రిడ్జి నిర్మాణం కాక ముందు ప్రతి వాహనం పిడుగురాళ్ల పట్టణంలో నుంచే వెళ్లాల్సి వచ్చేదన్నారు. అప్పుడు కనీసం 28 నిమిషాల నుంచి 35 నిముషాల వరకు సమయం పట్టేదని వివరించారు. ప్రయాణికుల బాధను గమనించిన ముఖ్యమంత్రి జగనన్న పగ్గాలు చేపట్టిన తరువాత బైపాస్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టడం.. యుద్ధ ప్రాతిపదికన దాన్ని పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. అయితే జగనన్న చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు టీడీపీ మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు కనిపించకపోవడం బాధాకరమని విమర్శించారు. బైపాస్ మొదటి ఫేజ్ పూర్తయి భారీ వాహనాలు బ్రహ్మాండంగా రాకపోకలు సాగిస్తుంటే యరపతినేనికి దృష్టికి రాకపోవడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు.

వైఎస్సార్ సేవాదళ్ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నరేంద్రరెడ్డి

నరసరావుపేట: వైఎస్సార్ సేవాదళ్ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పల్నాడు జిల్లాకు చెందిన కొప్పుల వెంకట నరేంద్ర రెడ్డి నియమితులయ్యారు. ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆరుగురిని గాయపరిచిన కారు అతివేగం



యడ్లపాడు: కారు అదుపుతప్పి ఆటో, స్కూటీని ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... బాపట్ల జిల్లా మార్టూరుకు చెందిన వృద్ధుడు మత్యానాయక్ గుంటూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని తిరిగి స్వగ్రామానికి కుటుంబ సభ్యులు, భార్య గోలి బాయి, కుమార్తె పద్మ, మనవడు వినోద్ అతని స్నేహితుడు స్వామియేలు ఆటోలో బయలుదేరారు. మండలంలోని తిమ్మాపురం జాతీయ రహదారి తిరుమల కాటన్ మిల్స్ సమీపంలోకి రాగానే అదే మార్గంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ఆటోను వెనుక నుంచి ఢీకొంది. అనంతరం ఆటో పక్కనే వెళ్తున్న స్కూటీని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మూడు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఆటోలో ప్రయాణిస్తున్న వృద్ధుడికి తీవ్రంగా, మిగిలిన వారితో పాటు స్కూటీపై ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ ఏఎస్ఐ కొండలు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన వారిని 108 వాహనం ద్వారా చిలకలూరిపేట ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని వాహనాలకు స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణలో భాగమవ్వాలి


ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

మాచర్ల: పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని ఫారెస్టు ఆఫీసు ఇన్‌చార్జ్ ఫారెస్టు రేంజర్ వెంకట రమణ పిలుపునిచ్చారు. స్థానిక చెంచు కాలనీలో బుధవారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె అతిథిగా హాజరై ప్రసంగించారు. వాహనాలు, ఫ్యాక్టరీల నుంచి వెలువడే పొగ కారణంగా పర్యావరణానికి ఇబ్బంది అవుతుందని, దీనిదృష్ట్యా సామూహికంగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అటవీ సంపద కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

అనుమతి లేని టీడీపీ ప్రచార వాహనంపై కేసు


నకరికల్లు పోలీస్‌స్టేషన్‌కు చేరిన టీడీపీ వాహనం

నకరికల్లు: ఎన్నికల నియమావళి అమలులో ఉన్నప్పటికీ టీడీపీ నేతలు మాత్రం వాటిని బేఖాతరు చేస్తున్నారు. ప్రచారం చేసుకునేందుకు కేటాయించిన వాహనాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాల్సి ఉండగా తెలుగుదేశం పార్టీ నాయకులు మాత్రం యథేచ్ఛగా ప్రచారం చేసుకుంటున్నారు. నకరికల్లు మండలం బాలాజీనగర్ తండా వద్ద బుధవారం రాత్రి ప్రచారంలో ఉన్న టీడీపీ వాహనాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు గుర్తించారు. వివరాలు అడగడంతో వారి వద్ద ఎలాంటి అనుమతులు లేవు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌కు సదరు వాహనాన్ని తరలించారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎంపీడీఓ డి.జయమణి మాట్లాడుతూ పార్టీలకు సంబంధించిన ప్రచార వాహనాలకు అనుమతులు లేకపోతే కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల కోడ్‌ను అమలు చేసేందుకు స్వచ్ఛందంగా సహకరించాలని నేతల్ని కోరారు. నియోజకవర్గంలో 15-20 టీడీపీ ప్రచార వాహనాలు గ్రామాల్లో తిప్పుతుండగా వాటిలో, ఎన్నింటికి అనుమతులు ఉన్నాయన్నది స్పష్టత లేదు.

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. హేమచంద్రారెడ్డి


పసంగిస్తున్న ప్రొఫెసర్ కె. హేమచంద్రారెడ్డి

తాడేపల్లిరూరల్: విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ పరిశోధనలు చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. హేమచంద్రారెడ్డి సూచించారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కె.ఎల్.విశ్వవిద్యాలయంలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాంత్రిక-2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ మెకానికల్ ఇంజినీరింగ్ రంగంలో రాణించాలని ఆకాంక్షించే విద్యార్థులు ఆ దిశగా పరిశోధనలు చేయాలన్నారు. అభివృద్ధి చెందుతున్న పరిశ్రమల డిమాండ్లపై ఇంజినీర్లు ప్రధాన విభాగాల్లో బలమైన పునాదికి కలిగి ఉండాలని సూచించారు. ఉత్పాదక రంగంలో మారుతున్న డైనమిక్స్‌కు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రాం, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రామకృష్ణ, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ విజయకుమార్, టి. చంద్రశేఖర్, సునీత పాల్గొన్నారు.

12 ఏళ్ల బాలుడిపై లైంగిక దాడి

వెంకటాయపాలెంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

బెల్లంకొండ: బహిర్భూమికి వెళ్లిన 12 ఏళ్ల బాలుడిపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కూలీ పనులు చేసుకునేందుకు బాపట్ల జిల్లా సంతమాగులూరు నుంచి వచ్చి వెంకటాయపాలెం గ్రామంలో బాధితుడి కుటుంబ సభ్యులు ఉంటున్నారు. వారితో మరికొందరు కూలీలు గ్రామంలో ఊరి చివరన గుడిసెలు వేసుకుని ఉంటున్నారు. కాగా గత సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన బాధిత బాలుడిపై కూలీ పనులకు వచ్చిన ముగ్గురు యువకులు శీలంచర్ల కోటేశ్వరరావు, చందు, కామేశ్వరరావు లైంగిక దాడికి పాల్పడ్డారు. విషయాన్ని బాధితుడు కుటుంబ సభ్యులకు చెప్పడంతో స్థానికులు లైంగిక దాడికి పాల్పడిన వారిని కొందరు పిలిపించి మందలించారు. విషయం బయటకు రాకుండా రాజీ చేసి, వైద్య ఖర్చులకు డబ్బులు ఇప్పిస్తామని చెప్పి పంపించారు. కాగా బాధిత బాలుడికి రక్తస్రావం అవుతుండడంతో సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లారు. దీంతో లైంగిక దాడి విషయం బయటకు వచ్చింది. మెరుగైన వైద్య చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. లైంగిక దాడికి పాల్పడిన వారు కూడా మైనర్లు కావడంతో వారిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఘటనపై శుక్రవారం దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ, సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబు విచారణకు రానున్నట్లు తెలిపారు.

రూ.78,260 నగదు స్వాధీనం


తనిఖీలలో పట్టుబడిన నగదు వివరాలు సేకరిస్తున్న అధికారులు

తాడికొండ: తాడికొండ అడ్డ రోడ్డులో తనిఖీలు నిర్వహిస్తుండగా ఎలాంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.78,260 నగదును స్వాధీనం చేసుకొని, ఐటీ అధికారులకు అప్పగించినట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.గంగరాజు గురువారం తెలిపారు. ఎస్ఐ వేణుగోపాల్, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో తాడికొండ శివారు బడేపురం గ్రామానికి చెందిన మొగిలి అశోక్ అనే వ్యక్తి కారులో తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకొని, విచారించారు. పెయింట్స్‌కు సంబంధించిన నగదు అని చెప్పినప్పటికీ అందుకు సంబంధించిన రసీదులు చూపించకపోవడంతో ఐటీ అధికారులకు పంపించినట్లు తెలిపారు. ప్రజలు రూ.50 వేలకు పైబడిన నగదు, బంగారం తరలింపునకు సంబంధించిన వ్యవహారాల్లో అందుకు తగిన లావాదేవీల బిల్లులు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పూర్తి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందిని, ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి, సిబ్బందికి సహకరించాలని సూచించారు.

వైఎస్సార్ సీపీలో పలువురికి రాష్ట్ర పదవులు

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాకు చెందిన పలువురిని పార్టీ పదవుల్లో నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు అందాయి. జిల్లాకు చెందిన నీలం రాజును పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్ర సేవాదళ్ విభాగం ప్రధాన కార్యదర్శిగా బుర్రా వెంకటశివారెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన మురుకుట్ల వెంకట సురేంద్రను నియమించారు.

సింహ వాహనంపై బ్రహ్మాండ నాయకుడు

- గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీవారు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- ఉదయం చిన్న శేషవాహనంపై విహరించిన నారసింహుడు


సింహ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న నారసింహుడు

మంగళగిరి: పట్టణంలోని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి గ్రామోత్సవంలో సింహ వాహనంపై విహరిస్తూ భక్తులకు స్వామి దర్శనమిచ్చారు. సింహ వాహనంలో కొలువుదీరిన బ్రహ్మాండ నాయకుడు నృసింహస్వామిని భక్తులు దర్శించుకున్నారు. కొబ్బరి కాయలు కొట్టి, హారతులిచ్చారు. హింసించే స్వభావం కలవారిని హింసించేవాడు నారసింహుడు. నరులలో సింహం వంటి వాడు. నరసింహ స్వరూపుడైన స్వామి సింహ వాహనోత్సవం తిలకించిన వారికి దుర్మార్గుల వల్ల కలిగే భయం తొలగుతుందని భక్తుల నమ్మకం. అభయాయచ సాధూనాం అంటూ సాధు జనులకు అభయాన్నిస్తూ.. దుర్మార్గాన్ని పారదోలుటకు స్వామి వారు సింహ వాహనరూఢుడై భక్తులకు దర్శనమిచ్చారు. పక్షుల్లో గరుత్మంతుడు, మృగాల్లో సింహం తానే అని స్వామి వారు చెప్పినట్లు.. అర్చకులు ఉత్సవ విశిష్టతను వివరించారు. ఉత్సవం సందర్భంగా రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు సాంస్కృతిక కళావేదిలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నరసింహుని వేషాలు, భజనలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాన్ని ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. ఉత్సవ కైంకర్యపరులుగా మాల్యవంతం వెంకటకృష్ణమాచార్యులు మనుమలు వ్యవహరించారు. ఆలయ పాలకవర్గ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు. ఉదయం చిన్న శేషవాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కైంకర్య పరులుగా దేవతి భగవన్నారాయణ కుటుంబం వ్యవహరించింది.

నేడు హంస, గజ వాహనాలపై స్వామి గ్రామోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం గజ వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్న శ్రీవారు.. రాత్రి గజ వాహనంపై స్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఎ. రామకోటిరెడ్డి తెలిపారు. భక్తులు స్వామిని దర్శించుకుని, కృపకు పాత్రులు కావాలని పేర్కొన్నారు.


హాజరైన భక్తులు